ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 13 అక్టోబరు 2025

విమానంలో ప్రయాణికుడికి అస్వస్థత

శంషాబాద్‌రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 6ఈ6223 ఇండిగో విమానం 166 మంది ప్రయాణికులతో ఆదివారం మధ్యాహ్నం 3.55 గంటలకు పాట్నాకు బయలుదేరింది. కొద్దిసేపటికే సంతోష్‌కుమార్ అనే ప్రయాణికుడు వాంతులు చేసుకుని తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. పైలెట్ వెంటనే ఏటీసీ (ఎయిర్ కంట్రోల్ సిస్టమ్) అధికారులకు సమాచారం అందించారు. విమానాన్ని ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు అనుమతి కోరారు. అనుమతి లభించడంతో తిరిగి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం ల్యాండైంది. సంతోషకుమార్‌ను ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. విమానం తిరిగి సాయంత్రం 5.56 గంటలకు పాట్నాకు వెళ్లింది.



బండ్లగూడ జాగీర్ పీహెచ్‌సీలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీంద్ర నాయక్

చుక్కల మందుకు చక్కని స్పందన

జిల్లాలో పల్స్ పోలియో విజయవంతం

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో బండ్లగూడ జాగీర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ రవీంద్ర నాయక్, జిల్లా వైద్యాధికారి డా.కె.లలితాదేవి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జిల్లాలో 0-5 సంవత్సరాల పిల్లలు 4,20,911 మంది ఉండగా 399457 మందికి చుక్కలు వేసినట్లు చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో 422 కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో 122 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. 155మంది రూట్ సూపర్‌వైజర్లు, 6204 బూత్‌ల వారీగా టీంసభ్యులు ఇందులో పాల్గొన్నారని ఆమె తెలిపారు. అంతేకాకుండా బస్టాండ్లు, మెట్రో స్టేషన్లు, ఎయిర్‌పోర్టు, పట్టణ కూడళ్లలో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆమె చెప్పారు. మొబైల్ టీంలు ఏర్పాటు చేసి భవన నిర్మాణ ప్రాంతాలు, ఇటుక బట్టీల్లో పనిచేసే కూలీల పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు ఆమె చెప్పారు.

నేడు కాంగ్రెస్ సమావేశం

చేవెళ్ల, శంకర్‌పల్లికి రానున్న ఏఐసీసీ సభ్యులు, పీసీసీ సభ్యులు



చేవెళ్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : డీసీసీ అధ్యక్ష నియామకంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ మెజార్టీ నేతలు, కార్యకర్తల అభిప్రాయసేకరణ కార్యక్రమం ఈనెల 13వ తేదీన చేవెళ్ల పట్టణ కేంద్రంలోని అట్లాస్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ మండలాలైన చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్ మండలాల నాయకులతో కూడిన సమావేశం చేవెళ్లలో నిర్వహించడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ- డీసీసీ అధ్యక్ష నియామకంలో భాగంగా పార్టీ నేతల అభిప్రాయాలు తీసుకునేందుకు ఏఐసీసీ సభ్యులతోపాటు పీసీసీ సభ్యులు ఎమ్మెల్సీ అద్దెంకి దాయకర్, పీసీసీ సభ్యులు కె. వినయ్‌రెడ్డి, కొత్వల్ అబ్దుల్లా, పి. విజయారెడ్డిలు స్వయంగా చేవెళ్లలో నిర్వహించే సమావేశానికి హాజరు కానున్నారని చెప్పారు. అలాగే బి బ్లాక్ మండలాలైన శంకర్‌పల్లి, నవాబ్‌పేట్ మండలాలకు చెందిన నాయకులతో కూడిన సమావేశం శంకర్‌పల్లి మండల కేంద్రంలో మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభం అవుతుందని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యనాయకులు, కార్యకర్తలు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పట్నం పెద్దచెరువుపై

హైడ్రా నజర్

ఇబ్రహీంపట్నం చెరువు ఎఫ్‌టీఎల్‌లో నీట మునిగిన ఇళ్లు (ఫైల్)



ఎఫ్‌టీఎల్, బఫర్‌లో అక్రమ నిర్మాణాలు

గుర్తించిన అధికారులు..

త్వరలో కార్యాచరణ?

ఇబ్రహీంపట్నం పెద్దచెరువు పేరుకే పెద్దది. ఆక్రమణలతో అది కాస్త చిన్నదిగా మారే ప్రమాదం పొంచి ఉంది. అడ్డదారిలో అనుమతులు తీసుకొని చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో వందలాది అక్రమ నిర్మాణాలు జరిగాయి. ఫంక్షన్ హాల్, రైస్ మిల్లు కూడా నిర్మించారు. ఈ ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యా దులు అందాయి దీంతో ఇటీవల హైడ్రా అధికారులు పెద్ద చెరువును సందర్శించి ఆక్రమణలపై ఆరా తీశారు. అయితే కబ్జాలపై హైడ్రా ఎలాంటి చర్యలు తీసుకుంటుందా అనేది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు ఆక్రమణలపై హైడ్రా నజర్ పెట్టింది. ఇప్పటికే ఫిర్యాదులు అందడంతో ఏడాది క్రితం హైడ్రా అధికారులు చెరువును సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో వందకు పైగా నిర్మాణాలు వెలిసినట్లు గుర్తించారు. చెరువు పైభాగాన ఓ కాలనీ మొత్తం ఎఫ్‌టీఎల్‌లో ఉంది. భవనాలే కాకుండా ఓ ఫంక్షన్ హాల్, ఉప్పరిగూడ పరిధిలోని ఓ రైస్ మిల్లు కూడా ఉండటం గమనార్హం. ఈ ఆక్రమణలపై త్వరలో హైడ్రా చర్యలు తీసుకోనుందని తెలుస్తోంది. పట్నం పెద్దచెరువు కట్టపై నుంచి అధికారులు, ప్రజాప్రతినిధుల వాహనాలు నిత్యం తిరుగుతుంటాయి. అయినా చెరువు పరిధిలో భారీగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. చాలా నిర్మాణాలకు అధికారులు

మిగతా 8వ పేజీలో...



నీట మునిగిన కాలనీ (ఫైల్)

ప్రజాస్వామ్యబద్ధంగా

పారదర్శకంగా..

డీసీసీ అధ్యక్షుల నియామకంపై ఏఐసీసీ పరిశీలకులు రాబర్ట్ బ్రూస్

కనీసం ఐదేళ్లు పార్టీలో పనిచేస్తేనే దరఖాస్తు చేసుకునేందుకు అర్హత

10 రోజుల్లో ప్రక్రియ పూర్తిచేసి అధినాయకత్వానికి నివేదిక

తటస్థులు, సాధారణ ప్రజల అభిప్రాయాలను సేకరిస్తాం

పైరవీలకు తావులేదు.. అందరికీ ఆమోదయోగ్యమైన వారికే పగ్గాలు



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు రాబర్ట్ బ్రూస్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : డీసీసీ అధ్యక్ష నియామకాలను ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా చేపడతామని ఏఐసీసీ పరిశీలకులు ఎంపీ రాబర్ట్ బ్రూస్ పేర్కొన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన మంచి వ్యక్తికే పగ్గాలు అప్పగిస్తామన్నారు. ఇందులో పైరవీలకు తావేలేదన్నారు. డీసీసీ అధ్యక్షుని నియామకం కోసం కాంగ్రెస్ అధినాయకత్వం ప్రతి జిల్లాకు ఏఐసీసీ నుంచి పరిశీలకులను పంపిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తమిళనాడు ఎంపీ రాబర్ట్ బ్రూస్‌ను రంగారెడ్డి జిల్లాకు పరిశీలకునిగా నియమించారు. పార్టీ ఆదేశానుసారంగా నగరానికి విచ్చేసిన రాబర్ట్‌బ్రూస్ ఆదివారం గాంధీభవన్‌కు విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ నేతలు వినయ్‌రెడ్డి, శ్రీనివాస్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం ఆదేశానుసారం డీసీసీ అధ్యక్షుడిని ఎంపిక చేసే ప్రక్రియ మొదలు పెట్టినట్లు తెలిపారు. జిల్లాలోని పార్టీ నేతలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగానే జిల్లా పార్టీ అధ్యక్షుడి నియామకం జరుగుతుందని తెలిపారు. గుజరాత్ మోడల్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా డీసీసీ అధ్యక్షులను నియమించి వారికి పార్టీలో పూర్తిస్థాయి అధికారాలను అప్పగించనున్నట్లు తెలిపారు. ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, నమూనా దరఖాస్తులను అందరికీ అందుబాటులో ఉంచుతున్నామన్నారు. అన్ని అర్హతలు ఉన్నవారికే పగ్గాలు అప్పగిస్తామన్నారు. కనీసం

మిగతా 8వ పేజీలో...

జాపాల సమీపంలో...



దారి కనిపించేదెలా..?

రోడ్లను కమ్మేస్తున్న చెట్ల కొమ్మలు

మంచాల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): చెట్ల కొమ్మలు రోడ్డును కమ్మేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచాల మండల కేంద్రం నుంచి రంగాపూర్ వరకు డబుల్‌రోడ్డు 14కిలోమీటర్ల మేర ఉంది. 66 ఫీట్ల వెడల్పు ఉండాల్సిన ఈ రహదారిపై 20 ఫీట్ల మేర బీటీ ఉంది. కాగా ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలతో అనేకచోట్ల దారి కుచించుకుపోయి అటుఇటూ 10 ఫీట్ల రోడ్డు మూసుకుపోయింది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణం వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. మూల మలుపుల మధ్య దారి కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించాలంటే కూడా ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మరిన్ని వివరాలు 6లో..



మంచాల సమీపంలో..

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి

పర్యావరణ శాస్త్రవేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి

కడ్తాల్,అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని పర్యావరణ శాస్త్రవేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి అన్నారు. మొక్కల పెంపకంతో మానవాళి మనుగడ సాధ్యమని ఆయన పేర్కొన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామంలోని ది ఎర్త్ సెంటర్‌లో ఆదివారం వాతావరణ మార్పులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులు ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించకపోతే మానవ మనుగడకు ప్రమాదమన్నారు. పర్యావరణ పరిరక్షణకు సీజీఆర్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ప్రజలు విరివిగా చెట్లను నాటి సంరక్షించాలన్నారు. సదస్సులో విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి రాజేశ్వరి, పర్యావరణ శాస్త్రవేత్తలు సాయిభాస్కర్‌రెడ్డి, సింగయ్య, పబ్లిక్ పాలసీ నిపుణులు నర్సింహారెడ్డి, సీజీఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి యువత, విద్యార్థులు ముందుకు రావాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ సమితి, చెట్టు అమ్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఇబ్రహీంపట్నం చెరువు కట్ట బీడీఎల్ రోడ్డు నుంచి చౌరస్తా వరకు 2కె రన్ నిర్వహించారు. డ్రగ్స్ బెట్టింగ్ రహిత సమాజమే లక్ష్యమనే నినాదంతో ఈ రన్ కొనసాగింది. డ్రగ్స్ బారిన పడి యువత భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, మంచి ఆలోచనలతో ముందుకు పోతేనే భవిష్యత్ బాగుంటుందని ఆయన అన్నారు. అలాగే బెట్టింగ్ మూలంగా ఎందరో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని, ఇది అత్యంత ప్రమాదకరమన్నారు. ఇప్పటికే డ్రగ్స్ నిర్మూలనకు కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ అధ్యక్షుడు తల్లోజు ఆచారి, సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాల మహేందర్, పర్యావరణ పరిరక్షణ సమితి చెట్టు అమ్మ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు దండు నరేష్, శ్రీనివాస్, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.



2కె రన్‌లో ఏసీపీ రాజు తదితరులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్వప్న

ఆమనగల్లు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వై.స్వప్న డిమాండ్ చేశారు. హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం కార్మికులంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఆమె పిలుపు నిచ్చారు. ఆమనగల్లులో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈనెల 26, 27వ తేదీలలో ఇబ్రహీంపట్నంలో జరిగే రాష్ట్ర మహాసభల విజయంతంపై చర్చించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని మండిపడ్డారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అమలుచేయాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి పద్మ, ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల మండలాల అధ్యక్షులు సబియాబేగం, బుజ్జమ్మ, శ్రీలత, కార్యదర్శులు లక్ష్మమ్మ, వరలక్ష్మీ, రాములమ్మ, జంగమ్మ, యశోద పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు నుంచి

‘కిమ్స్’ గ్రీన్‌చానెల్

25 నిమిషాల్లోనే ఆస్పత్రికి చేరిన లంగ్స్

శంషాబాద్ రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి వరకు ట్రాఫిక్ పోలీసులు ఆదివారం గ్రీన్‌చానెల్ ఏర్పాటు చేయడంతో 25నిమిషాల్లోనే లంగ్స్ ఉన్న బాక్స్ ఆస్పత్రికి చేరుకుంది. విశాఖపట్నం కిమ్స్ ఆస్పత్రిలో ఒక పేషెంట్ బ్రెయిన్‌డెడ్ కావడంతో అక్కడి వైద్యులు సికింద్రాబాద్ కిమ్స్ వైద్యులకు సమాచారం అందించారు. విశాఖ నుంచి రాత్రి 9 గంటలకు ఎయిర్‌పోర్టు చేరుకున్న లంగ్స్‌బాక్స్ అంబులెన్స్ సిబ్బంది 25 నిమిషాల్లో నగరంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. దానిని ఆస్పత్రిలో ఉన్న ఓ పేషెంట్‌కు అమర్చినట్లు వైద్య సిబ్బంది చెప్పారు. బాధితులు ట్రాఫిక్ పోలీసులకు, వైద్య సిబ్బందికి పేషెంట్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



పార్కులో మొక్కలు నాటుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి

ఘట్‌కేసర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నివారణకు ప్రతీఒక్కరు మొక్కలు నాటాలని పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. అన్నోజిగూడలో గల యాదాద్రి పార్కులో ఆదివారం ఆయన పలువురితో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ.. గత రెండు సంవత్సరాలుగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో భాగంగా పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించిందని తెలిపారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించకపోవడం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతినే ప్రమాదం ఏర్పడిందన్నారు. కాలుష్య నివారణకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఏటా అవసరాల నిమిత్తం కొన్నిచెట్లను నరికేస్తుంటారని వాటిస్థానంలో కొత్తగా మొక్కలు నాటడం వల్ల ఆ లోటును భర్తీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా తాను పలు జమ్మి, వేప, పారిజాత, కానుగతోపాటు పలు రకాల పండ్ల మొక్కలను తెప్పించి నాటినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు అబ్బవతిని నర్సింహ, జితేందర్‌నాయక్, విఠల్‌రెడ్డి, జంగయ్య, రాఘవ రెడ్డి, వెంకటేష్, నర్సింహులు, యశ్వంత్ పాల్గొన్నారు.

దారి కనిపించేదెలా?

రోడ్డుకు ఇరువైపులా పెరుగుతున్న పిచ్చి మొక్కలు
రోజురోజుకూ కుచించుకుపోతున్న రహదారులు
ఒక వాహనమొస్తే.. మరో వాహనం వెళ్లలేని పరిస్థితి
ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
పట్టించుకోని అధికారులు.. ఇబ్బందుల్లో ప్రజలు

ఆదిభట్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండల పరిధిలో రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఓ వైపు గుంతలు పడి పాడైపోగా.. మరో వైపు రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి రోడ్ల విస్తీర్ణం తగ్గిపోతోంది. మూల మలుపుల వద్ద ఉన్న పిచ్చి మొక్కలతో ఎదురుగా వస్తున్న వాహనలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు పక్కన పెరుగుతున్న మొక్కలతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి తలెత్తుతోంది. వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. పగటి వేళలో ఈ పరిస్థితి ఉంటే రాత్రి సమయంలో ఈ రోడ్లపై ప్రయాణమంటేనే చుక్కలు కనిపిస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. రోడ్లపై ఏర్పడ్డ గుంతలతో పాటు పిచ్చి మొక్కలతో ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లపై ఏర్పడ్డ గుంతలు, పిచ్చి మొక్కలను తొలిగించేందుకు ఆర్అండ్‌బీ, పంచాయతీ శాఖల అధికారులు చర్యలు చేపట్టడం లేదు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లను కప్పేసేలా పెరిగిన కంప, పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పట్టించుకొని రోడ్లు బాగు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

నిర్వహణ లోపంతో ప్రమాదాలు...

మండల పరిధిలోని గ్రామాలకు ఉన్న లింక్ రోడ్లతో పాటు ప్రధాన రోడ్లకు ఇరువైపులా కంప, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. ఇబ్రహీంపట్నం నుంచి ఎలిమేనేడుకు వెళ్లే 60ఫీట్ల రోడ్డు పిచ్చి మొక్కలతో విస్తీర్ణం తగ్గిపోతుంది. పొల్కంపల్లి నుంచి రాయపోల్ వెళ్లే దారిలో గుంతలతో పాటు రోడ్డు పక్కన ఉన్న కంప చెట్లతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాయపోల్-ఇబ్రహీంపట్నం రోడ్డులో మూల మలుపుల వద్ద ఉన్న కంప చెట్లతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. కప్పపహాడ్ నుంచి ఎలిమినేడు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలతో రోడ్డు మొత్తం కప్పుకుపోయి ఒక వాహనం వస్తే మరో వాహనం వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్లు వేసిన తర్వాత సంబంధిత శాఖల అధికారులు వాటి నిర్వహణపై పట్టించుకోక రోడ్లు ఇరుకుగా మారి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.



కప్పపహాడ్-ఎలిమినేడు రోడ్డులో ఇరువైపులా కప్పేసేలా పెరిగిన చెట్లు



ఇబ్రహీంపట్నం-ఎలిమినేడు బీటీ రోడ్డును ఆక్రమిస్తున్న పిచ్చి మొక్కలు

కంప చెట్లను తొలగించాలి



రోడ్ల నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో ఇరువైపులా కంప, పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో రోడ్డు మొత్తం కుచించుకుపోతోంది. పెద్ద రోడ్లు అయినా పొదలు, కంప చెట్లు వచ్చి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒక వాహనం వస్తే మరో వాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గతంలో అధికారులు రోడ్లపై పిచ్చి మొక్కలు తొలగించేవారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని కంప చెట్లను తొలగించాలి.

- బూడిద రాఘవేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్

ప్రమాదాలను నివారించాలి



గ్రామాలకు వెళ్లే రోడ్ల వెంట కంప, పిచ్చి మొక్కలు పెరిగి రోడ్లపైకి వచ్చాయి. రోడ్లు కుచించుకుపోయి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కప్పపహాడ్ నుంచి ఎలిమినేడుకు వెళ్లే మూల మలుపుల వద్ద ఏపుగా పెరిగిన కంప చెట్లు రోడ్డుపైకి రావడంతో ఆటో-బైక్ ఢీకొని ఓ వ్యక్తి కాళ్లు విరిగింది. ఈ రోడ్డుపై బస్సులు వస్తే బైక్ వెళ్లడం లేదు. అధికారులు చెట్లను తొలగించి ప్రమాదాలను నివారించాలి.

- జంగిలి ప్రభుదాస్, కప్పపహాడ్

దేశ నిర్మాణంలో స్వయం సేవకుల పాత్ర గొప్పది



శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

ఆమనగల్లు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): దేశ సేవలో స్వయం సేవకుల సేవకుల సేవలు మరువలేనివని ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రచార ప్రముఖ్ గన్నోజు భాస్కరచారి అన్నారు. ఆదివారం ఆమనగల్లు ఆర్ఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో వందేళ్ల ఆర్ఎస్ఎస్ ఉత్సవాలను నిర్వహించారు. శిశుమందిర్‌లో నిర్వహించిన శతాబ్ది ఉత్సవాల్లో కార్యకర్తలు పాల్గొన్నారు. శిశుమందిర్ నుంచి పట్టణంలోని జాతీయ రహదారి, ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం భాస్కరచారి మాట్లాడుతూ.. సమాజ ఉన్నతిలోనే మన ఉన్నతి అనే భావనతో డాక్టర్ హెగ్డేవార్ ఆర్ఎస్ఎస్‌ను స్థాపించారని తెలిపారు. అదే భావనతో దేశ అభివృద్ధికి హిందువులు పంచ పరివర్తన కోసం పాటుపడాలని సూచించారు. ఆర్ఎస్ఎస్ జన్మ శతాబ్దిలో భాగంగా రాబోయే రోజుల్లో ఇంటింటికి జాగర ణ చేపట్టబోతుందన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, మాజీ జెడ్పీటీసీ హరిప్రసాద్, ఆమనగల్లు ఖండ కార్యవాహ చుక్క ఆనంద్, స్వయం సేవకులు విశ్వనాథం, ఆంజనేయులు, తిరుపతి, మనోహర్, మాధవచారి, శ్రీశైలం, మహేశ్, జిల్లెల మహేశ్, నర్సింహ, వంశీ, నరేశ్, గణేశ్, శేఖర్, లక్ష్మణ్, శ్రీకాంత్‌సింగ్ పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు



కార్యక్రమంలో సయ్యద్ ఖలీల్, నాయకులు

ఆమనగల్లు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులో గ్యార్మీ షరీఫ్ వేడుకలు ఆదివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మౌలాలి పహడ్ దర్గా సమీపంలోని గౌసేపాక్ చిల్లా వద్ద నిర్వహించిన వేడుకల్లో ముస్లిం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి మత గురువు హజ్రత్ సయ్యద్ జహీరుద్దీన్‌షా ఖాద్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణ ముస్లింలు కలిసి గ్యార్మీ షరీఫ్ జెండాతో ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ నాయకుడు సయ్యద్ ఖలీల్ ఆధ్వర్యంలో అతడి నివాసం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



అన్నదానంలో ముస్లిం నాయకులు

లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు ప్రారంభం



లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో ఆలయ ధర్మకర్తలు కృష్ణ దంపతులు

పరిగి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం చతుర్థి వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం యాగశాల ప్రవేశం, పుణ్యాహః వచనం, దీక్షాధారణ, అంకురార్పణ, అఖండదీపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, ధ్వజారోహణ పూజ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు ఎదిరె పద్మ, కృష్ణ, జయశ్రీ, నరేందర్‌ల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



దుద్యాల్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి):హకీంపేట్‌లో మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం విగ్రహాల ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా కొనసాగిన పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఆలయ ఆవరణలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన నిర్వహించారు. గజ్జెల నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక చొరవతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ఎక్వాయిపల్లిలో మహా చండీయాగం

కడ్తాల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఎక్వాయిపల్లిలో ఆదివారం మహా చండీ, రాజశ్యామల యాగాన్ని నిర్వహించారు. నిర్వాహకుడు, బీజేపీ జిల్లా నాయకుడు జంగం వెంకటేశ్‌గౌడ్-ఉమ దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. చండీ ఉపాసకులు రామచంద్రశర్మ, రవిశాస్త్రిల ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు యజ్ఞం కొనసాగింది. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్, మాజీ సర్పంచ్ జంగం సుగుణసాయిలు, నాయకులు శంకర్ పాల్గొన్నారు.



చండీయాగం నిర్వహిస్తున్న వెంకటేశ్-ఉమ దంపతులు

డీసీసీ పదవి బీసీలకే ఇవ్వాలి

● సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఉత్తంచంద్



తాండూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి బీసీలకే ఇవ్వాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ ఉత్తం చంద్ అన్నారు. పార్టీలో సీనియర్‌గా ఉన్న తాను అధ్యక్ష పదవి ఆశిస్తున్నట్లు తెలిపారు. తనకు అధ్యక్ష పదవి ఇవ్వాలని ఇప్పటికే ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలకు విన్నవించానని తెలిపారు. పార్టీ అధిష్ఠానం కూడా బీసీలకు 42శాతం రిజర్వేషన్‌పై కట్టుబడి ఉండటంతో పాటు బీసీలకు పార్టీ పదవులు కట్టబెట్టేందుకు సానుకూల పరిస్థితి ఉందన్నారు. తనకు పార్టీ జిల్లా అధ్యక్ష పదవి లభిస్తుందని నమ్మకం ఉందని ఈ సందర్భంగా ఆదివారం ఆయన వెల్లడించారు.

రజకుల సంక్షేమానికి చొరవ చూపాలి



రజక సంఘం రాష్ట్ర నాయకుడు మల్లేశ్‌ను సన్మానిస్తున్న స్థానికులు

కందుకూరు, అక్టోబరు 12 (ఆద్రజ్యోతి): రజకుల సంక్షేమానికి ప్రభుత్వం చొరవచూపాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు బొమ్మరాజు మల్లేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమరాజు వెంకటేష్ అన్నారు. ఆదివారం సంస్థ మండల అధ్యక్షుడు అక్కనపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొత్తూరు గేటు వద్ద గల పెద్దమ్మ ఆలయం వద్ద నిర్వహించిన రజక ఆత్మీయ సమ్మేళనలో మాట్లాడారు. రాజకీయాల్లో రజకులకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మండల నాయకులు మల్లేశ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.కృష్ణ, సురేందర్, వెంకటేష్, గణేష్, శంకరయ్య, శ్రీనివాస్, ముత్యాలు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం


శామీర్‌పేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధి మురహరిపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగ నిర్వహించారు. ఈ ఉత్సవానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, అతిథిలుగా మండలంలోని వివిధ పార్టీల నాయకులు, మురహరిపల్లి మాజీ సర్పంచ్ భాస్కర్, లాల్‌గడి మలక్‌పేట మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, డబుల్ బెడ్‌రూమ్ కాలనీ వాసులు, భక్తులు విచ్చేసి కల్యాణోత్సవాన్ని తిలకించారు. స్వామివారికి పూజలను చేసి తరించారు.



లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, భక్తులు

నా డబ్బులు ఇప్పించండి

- రావాల్సిన బెనిఫిట్స్ కోసం రిటైర్డ్ హెచ్ఎం ఆవేదన


ఆవేదన వ్యక్తం చేస్తున్న రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఎర్వ పరంధాములు

కులకచర్ల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):'కూతురు పెళ్లికి అప్పు చేశా. అప్పులకు వడ్డీ కట్టేందుకు ఇబ్బందులు పడుతున్నా. నా కష్టార్జితం డబ్బులు ఇవ్వాలి.' అని కులకచర్లకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎర్వ పరంధాములు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఆదివారం తన నివాసంలో ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. తాను బండవెల్కిచర్ల ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తూ 2024 జూన్‌లో రిటైర్ అయినట్లు తెలిపారు. ఉద్యోగ విరమణ చేసి 16 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి రావాల్సిన జీపీఎఫ్ ఫైనల్ డబ్బులు, గ్రాట్యుటీ, కమిటేషన్ 40శాతం అమౌంట్, 6నెలల పైచిలుకు సరెండర్ లీవుల డబ్బులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యం బాగలేక మంచం పట్టానని, ప్రతీ నెల మందులకు రూ.40వేలు ఖర్చు అవుతోందన్నారు. పెద్ద కూతురు పెళ్లికి అప్పులు చేశానని, వాటికి వడ్డీ కట్టలేకపోతున్నానన్నారు. తన కష్టార్జితం డబ్బులు ప్రభుత్వం ఇవ్వడం లేదని కన్నీరుపెట్టారు. ఉద్యమాలు చేసి సాధించుకున్న తెలంగాణ ఇదేనా? అని ప్రశ్నించారు. తాను పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడిగా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా పనిచేసినా నేడు ఆ సంఘాలు కూడా పట్టించుకోవడం లేదని వాపోయారు. తనతో పాటే ఉద్యోగ విరమణ పొందిన వారు కోర్టుకు వెళ్లి ఖర్చు పెట్టుకొని డబ్బులు విడుదల చేయించుకుంటున్నారని, తనకు అంత స్థోమత లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి తనకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని కోరారు.

సీజేపై దాడిని నిరసిస్తూ నేడు కలెక్టరేట్ ముట్టడి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్



మహేశ్వరం, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి):సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్.గవాయ్‌పై కోర్టులో జరిగిన దాడిని న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా భావిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గట్టగల్ల ప్రశాంత్ అన్నారు. ఆదివారం మహేశ్వరంలో విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రధాన న్యాయమూర్తిపైనే దాడులు జరిగితే సామాన్యుల పరిస్థితి ఏంటన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉండాలంటే దాడికి పాల్పడిన రాకేశ్‌కిషోర్, అతడికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జస్టిస్ గవాయ్‌పై దాడికి పాల్పడిన సంఘటనను నిరసిస్తూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజాస్వామ్య వాదులంతా ఈ ధర్నాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలి


మాడ్గుల: సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు/మాడ్గుల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని ఆయన కోరారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అందుగుల గ్రామానికి చెందిన రవీందర్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.60వేల చెక్కును శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. వైద్య చికిత్స ఖర్చులు పేదలకు భారం కాకుండా ప్రభుత్వం చూడాలన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, బొజ్జయ్య, గణేశ్, సతీష్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

విద్యతోనే జీవితంలో విజయం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య


అనుమిత్రను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో ఉన్నత విద్యను అభ్యసించి, విజ్ఞానాన్ని పెంపొందించుకుంటే జీవితంలో విజయాన్ని సాధిస్తారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. షాద్‌నగర్‌కు చెందిన న్యాయవాది ఎ.అంజయ్య-భాగ్యమ్మల కుమార్తె అనుమిత్ర ఇటీవల గ్రూప్-1 ఫలితాల్లో రాణించి జాయింట్ కలెక్టర్‌గా విధుల్లో చేరారు. ఆమెను ఆదివారం బాబయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు కోరమేని హరిభూషన్ పటేల్‌లు సన్మానించి అభినందించారు. ఉన్నతస్థాయికి ఎదగాలన్న లక్ష్యంతో ప్రతి విద్యార్థి అనుమిత్రను ఆదర్శంగా తీసుకుని ఉద్యోగాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మురళి, నర్సింహులు, శివ పాల్గొన్నారు.

చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్ల బిల్లును
పార్లమెంట్‌లో ఆమోదింపజేయాలి

ఆమనగల్లు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డి డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చి చట్టబద్ధత కల్పించి రాజ్యాంగంలో 9వ షెడ్యూల్‌లో చేర్చుతామని హామీ ఇచ్చి నేడు మోసం చేసిందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ ఆరోపించారు. పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించకుండా జీవోలతో రిజర్వేషన్లు ప్రకటించడమేమిటని ఆయన అన్నారు. ఆదివారం ఆమనగల్లులో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే మోసం అన్నారు. కాంగ్రెస్‌కు బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో బీసీ బిల్లుపెట్టి ఆమోదింపజేయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు ఇస్తున్నామని చెల్లుబాటు గాని జీవో 9 విడుదల చేసి బీసీలను మోసం చేసిందన్నారు. ఈ నెల 14న రాష్ట్ర బీసీ సంఘాలు ఇచ్చిన తెలంగాణ బంద్‌కు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని జైపాల్ ప్రకటించారు. కాంగ్రెస్ గ్యారంటీల అమలులో విఫలమైందన్నారు. ప్రజల నుంచి దృష్టిమళ్లించేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను పథకాల అమలుకు ప్రజలు నిలదీయాలన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ముక్కుతున్న దొడ్డు బియ్యం

- పురుగు.. వాసనతో ఇబ్బందులు
- అయోమయంలో డీలర్లు


రేషన్ దుకాణంలో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం బస్తాలు

మేడ్చల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రేషన్ దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం బస్తాలతో డీలర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. వాతావరణం చల్లగా ఉంటుండటంతో బియ్యం ముక్కిపోయి పురుగు పట్టి వాసన వస్తున్నాయి. ప్రభుత్వం దొడ్డు బియ్యం బస్తాలను వెనక్కు తీసుకోకుండా నెలల పాటు రేషన్ డీలర్ల దుకాణంలోనే నిల్వ ఉంచడంతో డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్ నెల ఉగాది నుంచి ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో అప్పటికే రేషన్ దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని అధికారులు స్టాక్ రిజిష్టర్లలో ఎంట్రీ చేసి సీజ్ చేశారు. యథావిధిగా ప్రభుత్వం సరఫరా చేసిన సన్న బియ్యాన్ని రేషన్ డీలర్లు లబ్దిదారులకు పంపిణీ చేస్తున్నారు. అసలే ఇరుకైన రేషన్ దుకాణాల్లో డీలర్లు ఓ పక్క దొడ్డు బియ్యం సంచుల నిల్వ మరో పక్క పంపిణీ చేయాల్సిన సన్న బియ్యం సంచులతో ఇబ్బందులు పడుతున్నారు. మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్టు.. దాదాపు ఐదు నెలలుగా రేషన్ దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం ముక్కిపోయి పురుగు పట్టి వాసన వస్తున్నాయి. వాటితో కొత్తగా వచ్చిన సన్న బియ్యానికి సైతం పురుగు పడుతోంది. దీనితో డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు రేషన్ దుకాణాల్లో బియ్యం సంచుల నిల్వకు చోటు లేక డీలర్లు సతమతం అవుతున్నారు. ఎలుకలు, పురుగులతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అధికారులు వాటి గురించి పట్టించుకోకపోవడంతో డీలర్లు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని రేషన్ దుకాణాల్లో దాదాపు 800టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నట్లు అధికారుల అంచనా. రేషన్ దుకాణాల్లోని దొడ్డు బియ్యం బస్తాలను వెనక్కు తీసుకోవాలని డీలర్లు కోరుతున్నారు.

గ్రామాలను పట్టించుకోరా?

- కన్నెత్తి చూడని ప్రత్యేకాధికారులు
- రోడ్లపై పారుతున్న మురుగు నీరు
- కాలనీల్లో లోపిస్తున్న పారిశుధ్యం
- వెలగని స్ట్రీట్‌లైట్లు.. చీకట్లో ఇక్కట్లు
- సమస్యలు పరిష్కరించాలంటున్న ప్రజలు


నేదునూరులో రోడ్డుపై పారుతున్న మురుగు


కొత్తగూడ సీతారామశాస్త్రి కాలనీలో పొంగుతున్న మ్యాన్‌హోల్

కందుకూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలనలో వసతుల కల్పన కొరవడింది. పర్యవేక్షణలేక రోడ్లపై ఎక్కడికక్కడ మురుగునీరు పారుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన వీధుల్లో డ్రైనేజీ పొంగిపొర్లుతున్నా వాటికి మరమ్మతులు చేయించడం లేదు. పంచాయతీల్లో పాలక వర్గాలు లేక 20 నెలలు అవుతోంది. దీంతో అధికారులు ప్రభుత్వ పథకాల అమలును, మరో వైపు పంచాయతీల పాలనను చూడలేక విఫలం అవుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉండే పంచాయతీ కార్యదర్శులు నిధులు లేవని ఏ పనీ చేయించకుండా చేతులెత్తేస్తున్నారు.

దుర్గంధపూరితంగా రోడ్లు

ఇదిలా ఉంటే ప్రధానంగా రోడ్లపై ముగురు నీరు నిలుస్తూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్ట్రీట్‌లైట్లు వెలగక రాత్రిళ్ల రోడ్ల వెంట నడవలేకపోతున్నారు. కొన్ని సార్లు ప్రమాదాలకు గురవుతున్నారు. విష కీటకాలతోనూ ముప్పు పొంచి ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కందుకూరు పరిధి కొత్తగూడ పంచాయతీలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి పక్కన మురుగు నీరు నిలుస్తోంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ప్రత్యేక అధికారి ఎంపీడీవో సరిత సమస్యలను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కందుకూరు, నేదునూరు, కొత్తగూడ, జైత్వారం, దెబ్బడగూడ గ్రామాల్లో మ్యాన్‌హోళ్లు పొంగుతున్నాయి. వీధులు దుర్గంధభరితంగా మారుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీల ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సమాచారమిస్తున్నా స్పందించడం లేదు



కందుకూరు, కొత్తగూడ పంచాయతీల్లో ఇళ్లు కలిసి ఉంటాయి. నివాసాల నుంచి వచ్చే మురుగు నీటిని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేశారు. అయితే ఎక్కడికక్కడ మ్యాన్‌హోళ్లు పగిలిపోయాయి. వాటిలో పూడిక తీయడం గానీ, మరమ్మతులుగానీ చేయించడం లేదు. రోజూ మురుగు నీరు ఏరులై పారుతోంది. ఉదయం రోడ్డుపైకి రావాలంటే కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు.

- దాచపల్లి రాఘవేందర్, కందుకూరు

రోజూ ఇబ్బందులే ...



కందుకూరు, కొత్తగూడ గ్రామ పంచాయతీల్లో ఇండ్ల నుంచి వచ్చే మురుగు నీటిని మళ్లించడం లేదు. దీంతో రోజూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి ఎడమ పక్కన మురుగు నీరు చేరుతోంది. ప్రయాణికులు, వాహనదారులు, దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన భరించలేకున్నాం. సంబంధిత అధికారులు మురుగునీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలి.

- సొడపు వెంకటేష్‌గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు

బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం


షాబాద్‌లో రిలే నిరాహార దీక్ష చేస్తున్న బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు

షాబాద్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు పోరాడుతామని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అన్నారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టేవిధించడంతో ఆదివారం షాబాద్‌లో అంబేడ్కర్ చౌరస్తాలో సమితి నాయకులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 40ఏళ్లుగా బీసీలకు అన్యాయం చేస్తూ అణగదొక్కుతున్నారన్నారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు 42శాతం రిజర్వేషన్లు న్యాయమైన వాటా అని, ఇందుకు అన్ని రాజకీయ పార్టీలూ మద్దతు తెలపాలన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు రిలే నిరాహారదీక్షలను కొనసాగిస్తామన్నారు. దీక్ష చివరలో కురుమ సంఘం మండల అధ్యక్షుడు మద్దూరి పాండు దీక్ష చేసిన వారికి నిమ్మరసం ఇచ్చి తొలి రోజు విరమింపజేశాడు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు నర్సింహులు, రాజు, రాము, శ్రీశైలం, శేఖర్, రాజేందర్‌గౌడ్, రవీందర్, వెంకట్‌యాదవ్, రమేష్, చేవెళ్ల స్వామి, మాసయ్య, జి.చంద్రయ్య, హరిశంకర్, సుదర్శన్, సత్యనారాయణ, జంగయ్య, గోపాల్, సత్యనారాయణ, గణేష్‌గౌడ్, రమేష్, మల్లయ్య, బీరయ్య, ఆంజనేయులు, హరికుమార్, విఠలయ్య, హనుమంతు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో ప్రతీ ఒక్కరికి మేలు : ఎమ్మెల్యే


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రతీ కుటుంబానికి మేలు జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో ఆదివారం ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కసిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రభుత్వం పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందన్నారు. నియోజకర్గంలో రూ.వెయ్యి కోట్లతో రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు నారాయణరెడ్డి వెల్లడించారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో రూ.200కోట్లతో యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల, రూ.200కోట్లతో 220కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, నాయకులు అనంతరెడ్డి, నారాయణ, బ్లాక్ నర్సింహ, మహేశ్, వెంకట్‌రెడ్డి, కృష్ణ, రాజశేఖర్, డేవిడ్, వెంకటేశ్, గోపాల్, పాల్గొన్నారు.

మంచి పనులకు చిరస్థాయి కీర్తి

మంచి పనులకు చిరకాల కీర్తి లభిస్తుందని ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్‌లు అన్నారు. కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు, మాజీ ఉపసర్పంచ్ వర్కాల లక్ష్మయ్య సంతాప కార్యక్రమాన్ని ఆదివారం ఆయన కుమారులు శ్రీనువాస్, పాండు, ఆనందల ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యే హాజరై లక్ష్మయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు కృష్ణయ్య, జంగయ్య, మానయ్య, సురేందర్‌రెడ్డి, ఫరీద్,విజయ్, రాములు, యాదయ్య, మనోహర్ ఉన్నారు.


లక్ష్మయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు


జనావాసాల మధ్య సెల్ టవర్లు

- రేడియేషన్‌తో ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


పరిగిలో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సెల్ టవర్

పరిగి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జనావాసాల మధ్య సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ఉంచి వెలువడే రేడియేషన్‌తో జనం రుగ్మతలకు గురవుతున్నారు. సెల్ టవర్ల యాజమాన్యాలు పురపాలక సంఘం, పంచాయతీలకు పన్నులు ఎగ్గొడుతున్నా అధికారులు ఏ చర్యలు తీసుకోవడం లేదు. పరిగిలో పది చోట్ల టవర్లు ఉన్నాయి. అలాగే మండల పరిధి సయ్యద్‌పల్లి, రాపోల్, మాదారం, నస్కల్, గడిసింగాపూర్ గ్రామాల్లో వివిధ నెట్‌వర్క్‌లకు చెందిన 30కిపైగా సెల్ టవర్లను ఏర్పాటు చేశారు. ఏ గ్రామంలో సెల్ టవర్ నిర్మించినా.. వాటి ఏర్పాటు సమయంలో పంచాయతీకి రూ.10వేల అనుమతి ఫీజు కట్టాల్సి ఉంది. కానీ సెల్ టవర్ యజమానులు పన్ను చెల్లించిన దాఖలాలు లేవు. అలాగే ఏటా పంచాయతీలకు సెల్ టవర్ నిర్వాహకులు టవర్ సామర్థ్యాన్ని బట్టి పన్ను చెల్లించాల్సి ఉంది. టవర్లపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు అవగాహన లేక పన్నులు వసూలు చేయడం లేదు. ప్రజల నుంచి వసూలు చేస్తున్న ఇంటి పన్నులతో పాటు అధికారులు సెల్‌టవర్ నిర్వాహకుల నుంచి పన్నులు వసూలు చేస్తే గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. సెల్ టవర్ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు అన్ని సంవత్సరాల పన్నులు వసూలు చేయాల్సి ఉంది. పన్నుల సంగతి ఇలా ఉంటే ఇళ్లపై ఇష్టానుసారం టవర్ల నిర్మాణంతో గాలి, వానలకు ప్రమాదాలు జరిగే ఆస్కారం లేకపోలేదు. సెల్ సిగ్నల్స్ ఫ్రీక్వెన్సీ విషయంలోనూ నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నారు.

రేడియేషన్ ప్రభావం ఉంటుంది



ఇళ్ల మధ్యలో సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటుతో మనుషులపై రేడియేషన్ ప్రభావం ఉంటుంది. సెల్‌ఫోన్లను నిరంతరం వినియోగిస్తే దుష్ఫలితాలు ఉంటాయి. సెల్‌టవర్ల వైబ్రేషన్ తీవ్రస్థాయిలో ఉంటుంది. రేడియేషన్‌తో మనిషి చర్మంపై ప్రభావం పడుతుంది. ఇళ్ల మధ్యలో సెల్ టవర్లు లేకపోవడమే మేలు. అనుమతి లేని టవర్ల కంపెనీలపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- చిన్నయ్య, రిటైర్డ్ తహసీల్దార్, పరిగి

అయ్యో.. పార్వతమ్మ

- కుటుంబం ఉన్నా అనాథగా వృద్ధురాలి జీవనం
- రోజూ ఆకలి పోరాటం.. ఆదుకోని కోడళ్లు


చెత్త చెదారంలో కాలం గడుపుతున్న పార్వతమ్మ

షాద్‌నగర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ముగ్గురు కొడుకులు.. ఇద్దరు కోడళ్లు. సంతోషంగా సాగిన జీవితం.. ఏ లోటూ లేని కుటుంబం. ఒక్కసారిగా అంతా అతలాకుతలమైంది.. అనుకోని స్థితిలో ముగ్గురు కొడుకులూ మరణించారు. ఇద్దరు కోడళ్లు తమకు వద్దన్నారు. దీంతో ఓ వృద్ధురాలు అనాథలా రోడ్డున పడింది. ఆకలి పోరాటం చేస్తూ ఆదుకునే వారికోసం ఎదురు చూస్తోంది. షాద్‌నగర్‌లో కన్పించిన దృశ్యమిది. పట్టణంలోని పటేల్ రోడ్డులో ఉండే పార్వతమ్మ(80) కోడళ్లతో గొడవపడి ఇంటి నుంచి బయటకొచ్చి చటాన్‌పల్లి రైల్వేబ్రిడ్జి మొదటి పిల్లర్ రోడ్డు పక్కన నివసిస్తోంది. పట్టెడన్నం పెట్టే వారి కోసం ఆ పండుటాకు ఎదురు చూస్తోంది.

ఇదీ వృద్ధురాలి దీన గాథ...

షాద్‌నగర్‌కు చెందిన పార్వతమ్మది మధ్య తరగతి కుటుంబం. ఆమెకు ముగ్గురు సంతానం. అయితే ముగ్గురు కొడుకులు చనిపోయారు. కొన్నాళ్లు కోడళ్ల వద్ద ఉండేది. కొంత కాలంగా కోడళ్లతో పొసగక ఇంటి నుంచి బయటకు వచ్చి రోడ్డు పక్కన నివాసం ఉంటోంది. పటేల్ రోడ్డుకు చెందిన పలువురు నాయకులు కల్పించుకొని ఇలా రోడ్డు మీద పక్కన మంచిది కాదు.. ఇంటికి వెళ్లమని చెప్పారు. కానీ తాను ఇంటికి వెళ్లనని, బతికినంత కాలం రోడ్డుపైనే ఉంటానని పట్టుబట్టింది. కోడళ్లు కూడా ఆమెను పట్టించుకోకపోవడంతో కొన్నేళ్లుగా అక్కడే ఉంటూ ఎవరైనా తినేందుకు ఏమైనా ఇస్తే తిని కాలం గడుపుతోంది. అయితే పార్వతమ్మకు లక్షల విలువ చేసే ఇల్లు ఉందని, ఏం జరిగిందో కానీ ఆమె ఇంటిని వదిలి రోడ్డు పక్కన ఉంటోందని స్థానికులు చెబుతున్నారు.

వేధిస్తున్నాడని.. భర్తను చంపిన భార్య

- కేశంపేటలో ఘటన


కొప్పు కుమార్(ఫైల్)

కేశంపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి నిత్యం వేధిస్తున్నాని ఆగ్రహంతో ఓ మహిళ భర్తను హత్య చేసిన సంఘటన రంగారెడ్డి జిల్లా కేశంపేటలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ నరహరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొప్పు కుమార్(35), మాధవి దంపతులు. ఇద్దరు హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మద్యానికి బానిసైన కుమార్ తాగొచ్చి భార్యను వేధించేవాడు. శనివారం కుమారుడు సుశాంత్‌తో కలిసి భార్యభర్త ఇంట్లో నిద్రపోయారు. అర్ధరాత్రి భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో మాధవి భర్త తల, ఛాతిపై సిమెంట్ రాయితో కొట్టడంతో కుమార్ చెవిలో నుంచి రక్తంకారి మృతిచెందాడు. భర్త మృతదేహాన్ని ఇంటి ఎదుట ఉన్న సంపులో వేసింది. రక్తపు మరకలను తుడిచి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుమార్‌ను భార్యనే చంపి ఉంటుందని స్థానికులు అనుమానించారు. మాధవిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా వేధింపులు తట్టుకోలేక హత్యచేసినట్లు అంగీకరించింది. కుమార్ సోదరుడు జంగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ


ధారూరు-కుక్కింద రోడ్డు పక్కన లీక్ అవుతున్న పైప్‌లైన్

ధారూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ధారూరు-కుక్కింద రోడ్డులో రైస్ మిల్లు సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయి భగీరథ నీరు లీక్ అవుతోంది. ఆదివారం పైపులైన్ పగిలి తాగునీరు వృధాగా పోతోంది. మిషన్ భగీరథ పైపులైన్ నాణ్యత లేకపోవటం వల్లే తరచూ పైపులైన్‌లు పగిలి తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగి ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. పైపులైన్ మరమ్మతుల్లో జాప్యం వల్ల తాగునీటి సరఫరా నిలిచిపోతోంది. అధికారులు వెంటనే పైపులైన్‌కు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి


మాట్లాడుతున్న సీఐ వెంకట్

మోమిన్‌పేట్/నవాబుపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రతీ దుకాణం, ఇంటి ఎదుట సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని మోమిన్‌పేట్ సీఐ వెంకట్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. మోమిన్‌పేట్, మర్పల్లి, నవాబుపేట మండలాల ప్రజలు దుకాణ సముదాయాలు, ఇళ్ల ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే ప్రజాభద్రతకు దోహదపడుతాయన్నారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. మోమిన్‌పేట్ సర్కిల్ పోలీసు అధికారులు ప్రజలకు సహకారం అందిస్తున్నారన్నారు. కెమెరాలు ఎక్కడ, ఎలా ఏర్పాటు చేయాలో సంబంధిత ఎస్ఐలు బీట్ అధికారులు ప్రజలకు మార్గదర్శనం చేస్తారన్నారు.

'విద్యా సంస్థలను తరలించొద్దు'

కొడంగల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కొడంగల్‌కు మంజూరైన మెడికల్, సమీకృత గురుకులాలను లగచర్లకు తరలించొద్దని కొడంగల్ అభివృద్ధి పరిరక్షణ ఐక్య కార్యచరణ కమిటీ కన్వీనర్ లక్ష్మీనారాయణగుప్తా, కో-కన్వీనర్‌లు జి.సురేశ్‌కుమార్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, శాంత్‌కుమార్, ఎస్ఎం.గౌసన్, నవాజ్, రమేశ్‌బాబు అన్నారు. ఆదివారం కొడంగల్‌లోని రెడ్డి బసిరెడ్డి గార్డెన్‌లో మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలను తరలించొద్దని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన, వ్యాపారులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. అప్పాయిపల్లిలోని మెడికల్, పాత కొడంగల్‌లో సమీకృత గురుకులాలను లగచర్లకు ఎందుకు తరలిస్తున్నారో చెప్పాలన్నారు. విద్యాసంస్థలను ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఈ ప్రాంతానికి అన్యాయం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతం నుంచి విద్యా సంస్థలు తరలిపోకుండా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కొడంగల్ పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా లక్ష్మీనారాయణ గుప్తా ఎన్నికయ్యారు. ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు
- పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం



శంకర్‌పల్లి : చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య



కందుకూరు : పోలియో చుక్కలు వేస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ గీత



షాద్‌నగర్ అర్బన్ : చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఆమనగల్లు : చిన్నారులకు చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పోలియో రహిత సమాజ నిర్మాణానికి పూర్తి సహకారం అందించాలని ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం షాద్‌నగర్ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో చిన్నారులకు ఎమ్మెల్యే పోలియో చుక్కలు వేశారు. ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు బాలబాలికలందరికీ విధిగా వందశాతం పోలియో చుక్కలను వేయించడానికి వైద్యసిబ్బందికి ప్రతీ ఒక్కరు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. డీడీఎంఅండ్ హెచ్‌వో వి.విజయలక్ష్మి, వైద్యాధికారి స్రవంతి, ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపల్‌లోని మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించి చిన్నారులకు చుక్కలు వేశారు. శంకర్‌పల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ గోవిందమ్మ గోపాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ చంద్రమోహన్, పీహెచ్‌సీ వైద్యురాలు రేవతి రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

చేవెళ్ల : ఎమ్మెల్యే యాదయ్య చేవెళ్ల పట్టణ కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మాలతికృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సమతారెడ్డి, వైద్యసిబ్బంది ఉన్నారు.



కొత్తూర్ : పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య దేవేందర్‌యాదవ్

ఆమనగల్లు : ఆమనగల్లు మండలం, మున్సిపాలిటీ పరిధిలో 31కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయం వద్ద కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించి చిన్నారులకు చుక్కల మందు వేశారు. డాక్టర్ షైమునా బేగం, డాక్టర్ మంజుల దేవి, డాక్టర్ విజయ, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, వైద్య సిబ్బంది ఆశాలు పాల్గొన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో మైసిగండి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్‌లు పాల్గొని చిన్నారులకు చుక్కల మందు వేశారు. నాయకులు నాగార్జున, సురేశ్, ఆహ్మద్, అంగన్‌వాడీ కార్యకర్తలు బాగ్యమ్మ, యాదమ్మ, ఆశాలు సబిత, వైద్యసిబ్బంది, పాల్గొన్నారు.

తలకొండపల్లి : వెల్జాలలో మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ పల్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ముజుబుర్ రహెమాన్, వైద్యసిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీ సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : చిన్నారులకు పోలియో చుక్కల మందును తల్లిదండ్రులు విధిగా వేయించాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ గీత అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి ఉమేరాసుల్తానాతో కలిసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రఫీక్, డీపీఎంవో సుదర్శన్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం : ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలని దుబ్బచర్ల పీఎచ్‌సీ వైద్యురాలు కల్పన అన్నారు. దుబ్బచర్ల పీఎచ్‌సీ పరిధిలో మొత్తం 5305 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా ఆదివారం 5012 మంది చిన్నారులకు చుక్కలు వేశామని 95 శాతం చుక్కలు వేశామని మిగతా వారికి కూడా చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది తదితరులున్నారు.

మంచాల : మండల పరిధిలో పల్స్ పోలియో విజయవంతంగా ముగిసింది. మంచాల, ఆరుట్ల సెక్టార్‌లకు సంబంధించి 42 సెంటర్లలో 5200 మందికి చుక్కలు వేశారు. వైద్యాధికారులు డా.శ్రావణ్‌కుమార్, డా.దీప్తి, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

యాచారం : పోలియో చుక్కల మందు చిన్నారులకు ఎంతో శ్రేయస్కరమని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక అన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పోలియో చుక్కలు వేశారు.

చౌదరిగూడ/కొందుర్గు : పోలియో రహిత సమాజాన్ని తీర్చిదిద్దుదామని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, కొందుర్గు వైద్యాధికారి అమృతా జోసఫ్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో పోలియో చుక్కలు వేశారు. వైద్య సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కేశంపేట : కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నిఖిత ఆధ్వర్యంలో నాలుగు రూట్లలో 51 బూత్‌లు ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేశారు. కేశంపేటలో మాజీ సర్పంచ్ యెన్నం శ్రీధర్‌రెడ్డి, కొండారెడ్డిపల్లిలో కాంగ్రెస్ నాయకులు పల్లె ఆనంద్ కుమార్, చౌలపల్లిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్, కొత్తపేట బీజేపీ నాయకులు పసుల నరసింహ యాదవ్, పలు గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు చుక్కలు వేశారు.

షాబాద్ : సమాజంలో పోలియోను నిర్మూలించడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో నాగేంద్రబాబు అన్నారు. హైతాబాద్, చందన్‌వెళ్లిలో చిన్నారులకు చుక్కల మందు వేశారు. డాక్టర్ ప్రణీత్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ : సమాజం నుంచి పోలియోను తరిమివేసేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పీహెచ్‌సీ డాక్టర్ దీప్తి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, సీహెచ్‌వో నాగేశ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



మంచాల : లింగంపల్లిలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న సిబ్బంది

ఆత్మహత్య కాదు.. హత్యే..

క్రైం కార్నర్

- తండ్రితో కలిసి అన్నను కడతేర్చిన వైనం
- ఆలస్యంగా వెలుగులోకి.. ఇద్దరి రిమాండ్

షాబాద్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. వారంరోజుల క్రితం మండల పరిధిలోని కుర్వగూడ గ్రామంలో దాదే బాలకృష్ణ(45)ను ఆయన తండ్రి నర్సింహులు, సోదరుడు(తమ్ముడు) రాఘవేందర్ కలిసి అతడిని హత్య చేశారు. అయితే, బాలకృష్ణ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు చున్నీతో ఇంట్లోనే ఉరేశారు. అతడి మృతి అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తండ్రీకుమారుడు కలిసి హత్య చేసినట్లు తేలింది. అయితే, మద్యం సేవించి తరచూ వేధిస్తుండడంతో తామే హత్య చేసినట్లు నిందితులు తెలిపారు. ఈమేరకు వారిద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం.. కేసు నమోదు



నేనావత్ రష్లి(ఫైల్)

ఆమనగల్లు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని నుచ్చుగుట్ట తండాకు చెందిన నేనావత్ రష్లి(65) అదృశ్యమైంది. శనివారం ఇంట్లో జరిగిన గొడవ కారణం గా మనస్తాపం చెందిన రష్లి ఇంటినుంచి వెళ్లిపోయిందని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ఆమె కుమారుడు భీమన్ ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఆమనగల్లు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఆమనగల్లు ఎస్సై వెంకటేశ్ సూచించారు. ఆదివారం ఆమనగల్లు పట్టణంలోని శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై కడ్తాల్, తలకొండపల్లి ఎస్సైలు శ్రీకాంత్, చంద్రశేఖర్, సీతారామ్‌రెడ్డి, పోలీసు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంబంధించిన ఆర్‌సీలు, లైసెన్స్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. నియమాలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్ ఉపయోగించవద్దని, ఇతరులతో మాట్లాడకుండా డ్రైవింగ్ చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. తనిఖీల్లో సీటుబెల్టు, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన వారికి జరిమానాలు విధించారు.

హెల్మెట్ తప్పక ధరించాలి



వాహనదారుడికి సూచనలిస్తున్న ఇన్‌స్పెక్టర్ నర్సయ్య

కొత్తూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనచోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని ఇన్‌స్పెక్టర్ జి.నర్సయ్య సూచించారు. మండల పరిధిలోని నాట్కో చౌరస్తా వద్ద ఆదివారం ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలతో పాటు, మధ్య, భారీ వాహనాలను తనిఖీ నిర్వహించి, పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ వాహనచోదకులు ట్రాఫిక్ రూల్స్ తూచా తప్పకుండా పాటించాలని, ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ ధరించాలన్నారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు. ఎస్సై సత్యశీలారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు



నాగర్‌గూడలో పాన్‌షాప్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

షాబాద్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి హెచ్చరించారు. షాబాద్ మండల పరిధిలోని నాగర్‌గూడ, హైతాబాద్‌లో గుట్కాలు అమ్ముతున్న పాన్‌షాపులపై దాడులు చేసి స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ నిషేధిత గుట్కాలను అమ్మివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై సతీష్‌కుమార్, ఏఎస్సై రాంలాల్, సిబ్బంది ఉన్నారు.

సీజేపై దాడిచేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

ఆదిభట్ల/యాచారం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన అడ్వకేట్ రాకేశ్ కిషోర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి, తక్షణమే అరెస్ట్ చేయాలని యాచారం ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు మహేశ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీజేపై దాడిని నిరసిస్తూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆదివారం అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ సీజేఐ గవాయ్‌పై దాడి చేసిన ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని అడ్వకేట్ రాకేశ్ కిషోర్‌ను అరెస్ట్ చేయాలన్నారు. దాడిని నిరసిస్తూ దేశవ్యాప్తంగా 10 రోజుల పాటు జరిగే నిరసన కార్యక్రమాల్లో ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయవాదులు పాల్గొన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 13న జిల్లా కలెక్టరేట్, 22న చలో హైదరాబాద్ కార్యక్రమం ఉంటుందని ఎమార్పీఎస్ నాయకులు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంద లింగం, కొండల్, మహేందర్, శంకర్, రమేష్, ప్రసాద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

కందుకూరు/యాచారం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన సురిగి శ్రీనివాస్‌గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు విషయం తెలుకున్న 2002-2003 బ్యాచ్ పదో తరగతి స్నేహితులు ఆదివారం శ్రీనివాస్‌గౌడ్ కుటుంబసభ్యులకు రూ.లక్షా 25వేల ఆర్థిక సాయం అందజేశారు.

పట్నం పెద్దచెరువుపై హైడ్రా నజర్



చెరువు శిఖాన ఎఫ్‌టీఎల్‌లో వెలిసిన ఇళ్లు



ఇబ్రహీంపట్నం చెరువు

(ఐదో పేజీ తరువాయి)

అనుమతులిచ్చారు. నల్లా కనెక్షన్లు, విద్యుత్ కనెక్షన్లు కూడా ఉన్నాయి. పన్నులు కడుతున్నారు. నీట మునిగిన ఓ కాలనీ నిర్మాణానికి బ్యాంకు రుణం కూడా ఇచ్చింది. ఈచెరువును కాపాడాలని పర్యావరణ వేత్తలు సైతం పలు మార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయితే, ఈ నిర్మాణాలు ఈ మధ్య కాలంలో జరిగినవి కావు. పాతికేళ్ల క్రితం నుంచే ఈ నిర్మాణాల పరంపర కొనసాగింది. కాగా, హైడ్రా ఈ ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

మూడేళ్ల క్రితం...

నాగార్జునసాగర్ - హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు ఆక్రమణలకు గురైంది. అధికార యంత్రాంగం ఉదాసీనత, పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడంతో ఎఫ్‌టీఎల్‌ను అక్రమార్కులు చెరబట్టారు. ఈ చెరువు ఫుల్‌ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) 1452.8 ఎకరాలు ఉంది. ఈ చెరువులో భాగంగా ఉన్న చిన్న చెరువైతే ఆనవాళ్లను కోల్పోతుంది. గతంలో రియల్టర్లు ఎఫ్‌టీఎల్ హద్దులను తొలగించి లేఅవుట్లు వేసి ప్లాట్లను విక్రయించారు. పేద, మధ్య తరగతి జనం ప్లాట్లు కొనుగోలుచేసి ఇళ్లు నిర్మించుకున్నారు. ఇళ్ల నిర్మాణానికి బ్యాంకు అధికారులు రుణం కూడా ఇచ్చారు. చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఓ ఫంక్షన్ హాల్‌ను కట్టారు. అప్పట్లో ఇబ్రహీంపట్నం మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడు ఈ నిర్మాణాలకు ఎడాపెడా అనుమతులు ఇచ్చారు. అప్పట్లో ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో రియల్టర్లు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. కాగా 46 ఏళ్ల పాటు ఏనాడూ చెరువులోకి పూర్తిస్థాయిలో నీరు రాలేదు. కాగా 2022 సంవత్సరం సెప్టెంబరు, అక్టోబరులో కురిసిన భారీ వర్షాలకు చెరువు నిండి అలుగుపారడంతో ఆక్రమణల బండారం బయటపడింది. ఇళ్లలోకి వరదనీరు వచ్చి చేరడంతో నివాసం ఉంటున్న ప్రజలను ఖాళీ చేయించారు. అదే సమయంలో చెరువులో నీటిమట్టం తగ్గడంతో తిరిగి ఇళ్లలోకి వచ్చి చేరారు.

పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు..

18వ శతాబ్దంలో నిర్మించిన ఈ చెరువు నాగార్జునసాగర్- హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఆకర్షణగా ఉంటుంది. మూడు కిలోమీటర్ల పొడవున చెరువు కట్ట, రెండు ప్రధాన తూములు కలిగి ఉంటుంది. అయితే ఈ చెరువును పర్యాటకంగా తీర్చిద్దిదడానికి ఇటీవలే రూ.20కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. హెచ్‌ఎండీఏ నిధులతో దీనిని మినీ ట్యాంకు బండ్‌గా అభివృద్ధి చేస్తూ చెరువు సుందరీకరణ, పిల్లల పార్కు, ఫ్లోటింగ్ రెస్టారెంట్, స్పీడ్ బోట్లు, పెడల్ బోట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కాగా నాలుగేళ్ల క్రితం ఈ పెద్ద చెరువులో భాగమైన చిన్న చెరువులో రూ.25 లక్షలు ఖర్చుచేసి వాకింగ్ ట్రాక్, పార్కును ఏర్పాటు చేశారు. 2022లో చెరువు నిండిన సమయంలో ఇది పూర్తిగా మునిగిపోయింది. ప్లానింగ్ లేకుండా ఏర్పాటు చేశారని ఆ సమయంలో విమర్శలు వచ్చాయి.

ఫీడర్ చానళ్ల మరమ్మతులతో నేరుగా చేరుతున్న వరద నీరు

పెద్ద చెరువుకు నీరందించే ప్రధాన కాలువలను కొందరు చెరబట్టారు. ఈ చెరువుకు వచ్చే కాలువల్లో ఒకటి ఫిరంగి నాలా (రాచకాలువ) కాగా, మరొకటి పెద్ద కాలువ. ఫిరంగినాలాను అక్కడక్కడ కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారు. రియల్టర్లు పలుచోట్ల కాలువను ధ్వంసం చేయడంతో వరద నీరు రావడానికి అడ్డంకిగా మారింది. ఇక పెద్దకాలువను ఇసుక కోసం తవ్వడంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. ఫిల్టర్ ఇసుక తీసి కాలువ నుంచి వరద రాకుండా చేశారు. ఇది గమనించిన అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చొరవ చూపి కాలువల మరమ్మతులు, చెక్ డ్యామ్‌ల నిర్మాణాలకు రూ.15కోట్లు మంజూరు చేయించారు. అనంతరం పనులు పూర్తిచేయించడంతో వరద నీరు నేరుగా పెద్ద చెరువుకు చేరేందుకు మార్గం సుగమమైంది. ఈమేరకు ఎలిమినేడు నుంచి పోచారం కత్వ వరకు నాలుగు కిలో మీటర్ల కాలువ పునరుద్ధరణ చేశారు.

త్వరలో పర్యాటక హంగులు కల్పిస్తాం



త్వరలోనే హెచ్‌ఎండీఏ నిధులతో పెద్ద చెరువు సుందరీకరణ పనులు చేపట్టి మినీ ట్యాంకు బండ్‌గా తీర్చిదిద్దుతాం. అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో ఈ చెరువును పర్యాటకంగా తీర్చిదిద్దడానికి అన్ని హంగులు ఉన్నాయి. ఇప్పటికే దీనికి సంబంధించి ప్రణాళిక రూపొందించాం. వీలైనంత తొందరలో నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తాం.

\- మల్‌రెడ్డి రంగారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే

చెరువు ఎఫ్‌టీఎల్‌లో అనుమతుల్లేవ్



చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతులు లేవు. ఈ విషయంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. చెరువు వైపు ప్లాట్లు కొనేముందు వివరాలు తెలుసుకోవాలి. ఏదైనా సమస్య ఉంటే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకురావాలి. అనుమతుల విషయంలో మున్సిపల్‌లో కిందిస్థాయి అధికారులకు కూడా స్పష్టమైన ఆదేశాలిచ్చాం.

\- బి.సత్యనారాయణరెడ్డి, పట్నం మున్సిపల్ కమిషనర్

బీసీలు సంఘటితంగా ముందుకు సాగాలి

ఆమనగల్లు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): 42శాతం రిజర్వేషన్ల సాధనకు బీసీలంతా ఐక్యంగా ముందుకు సాగాలని బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. బీసీలకు రావాల్సిన న్యాయమైన హక్కుల కోసం సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం బీసీ సంఘాల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంఘం పిలుపుమేరకు ఈనెల 14న నిర్వహించే తెలంగాణ బంద్ విజయవంతంపై చర్చించారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటించారు. బంద్ విజయవంతానికి బీసీ సంఘం నాయకులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు. రిజర్వేషన్లు సాధించేవరకు ఐక్యంగా ముందుకు సాగాలని వారు కోరారు.

నేడు సన్నాహక సమావేశం

బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నేడు(సోమవారం) సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని హనుమాన్ ఆలయంలో నిర్వహించే సమావేశానికి బీసీ సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో 14న బంద్ విజయవంతం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు చుక్కా అల్లాజీగౌడ్, తల్లోజు రామకృష్ణ, ఎంగళి బాలకృష్ణ, అవ్వారి శివలింగం, నిరంజన్‌గౌడ్, కోట్ల వెంకటేశ్, దుడ్డు ఆంజనేయులు, గోల్డ్ రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా పారదర్శకంగా..

(ఐదో పేజీ తరువాయి)

ఐదేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీలో పనిచేసే వారే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఆసక్తి గలవారు 18వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మెజార్టీ నేతలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా, పారదర్శకంగా ఈ నియామకాలు చేపడతామన్నారు. సోమవారం చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని రెండు బ్లాక్‌లకు సంబంధించి రెండు సమావేశాలు నిర్వహించి ఈ ప్రాంతంలోని పార్టీకి సంబంధించిన అందరినీ కలిసి వారి అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. 10 రోజుల్లో మొత్తం ప్రక్రియ పూర్తిచేయనున్నట్లు తెలిపారు.

తటస్థుల అభిప్రాయాలూ సేకరణ

జిల్లా అంతటా తిరిగి పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ఇతర ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకుంటామని రాబర్ట్ బ్రూస్ తెలిపారు. పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న వారితోపాటు పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ఇతర మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలతో మాట్లాడతామన్నారు. అలాగే తటస్థులు, సాధారణ ప్రజలు, రైతుల నుంచి కూడా అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. ఇందుకోసం తాను రోడ్డు మార్గంలో అన్ని నియోజకవర్గాలకు వెళ్తున్నట్లు తెలిపారు. రోజుకో నియోజకవర్గంలో అభిప్రాయసేకరణ చేస్తామన్నారు. ఉదయం ఒక బ్లాక్, సాయంత్రం మరో బ్లాక్‌కు సంబంధించిన నేతలు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకుంటామన్నారు. తాము సేకరించిన అభిప్రాయాలకు అనుగుణంగా నివేదిక రూపొందించి దీన్ని ఢిల్లీ పెద్దలకు అందచేస్తామన్నారు. ఈ ప్రక్రియ సజావుగా జిల్లాలో ముందుకు సాగేందుకు పీసీసీ నియమించిన పరిశీలకులు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌తో పాటు కె.వినయ్‌రెడ్డి, కొత్వాల్ అబ్దుల్లా, పి. విజయారెడ్డిల సహాయ సహకారాలను తీసుకుంటామన్నారు. పార్టీ అధినాయకత్వం తనకు అప్పగించిన బాధ్యతలను తూచా తప్పకుండా అమలు చేస్తానన్నారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన పార్టీ అగ్రనేతలు ఖర్గే, రాహుల్‌గాంధీ, వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు మహేష్‌గౌడ్, ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచందర్‌కు రాబర్ట్ బ్రూస్ కృతజ్ఞతలు తెలిపారు.

ఏది చెప్పాలనుకున్నా... అక్కడే

డీసీసీ అధ్యక్షుని నియామకం కోసం నగరానికి విచ్చేసిన ఏఐసీసీ పరిశీలకుడు రాబర్ట్ బ్రూస్ ఆడంబరాలకు దూరంగానే ఉన్నారు. ప్రత్యేకంగా ఎవరినీ ఆయన కలవడం లేదు. జిల్లా నేతలకు కీలక సూచనలు చేశారు. తనను కలవడానికి ఎవరూ రానవసరం లేదని, తానే నియోజకవర్గానికి వస్తానన్నారు. ఏం చెప్పాలనుకున్నా నేతల, కార్యకర్తలు అక్కడే చెప్పాలని సూచించారు. ప్రతీ ఒక్కరి అభిప్రాయాన్ని తెలుసుకుంటామని తెలిపారు. కాగా, ఇందువల్ల ఎవరూ తనను కలిసేందుకు హైదరాబాద్‌కు రానవసరం లేదన్నారు. తాను నగరంలో బస చేసే వివరాలను కూడా స్థానిక నేతలకు ఇవ్వరాదని పార్టీ కీలక నేతలకు ఈ సందర్భంగా ఆదేశాలు ఇచ్చారు.

నాయకుడి ఉదారత.. రోడ్డుకు మరమ్మతులు



కొత్తూర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని స్టేషన్ తిమ్మాపూర్ వద్ద గోతులమయంగా మారిన రోడ్డులో మట్టిని నింపి ఉదారత చాటుకున్నాడు యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వన్నాడ శివశంకర్‌గౌడ్. వర్షాలకు రోడ్డుపై గోతులు పడడంతో వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతూ వచ్చారు. శివశంకర్‌గౌడ్ సొంత డబ్బుతో మట్టి పోయించారు. మహేందర్, శ్రీనివాస్, రఫీక్, అరుణ్, గణేష్, అంజి, శ్రీకాంత్, వినోద్, సాయి, ఈశ్వర్, శేఖర్ తదితరులున్నారు.

ప్రజలను మోసగిస్తున్న ప్రభుత్వం

మొయినాబాద్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మార్పు పేరుతో ప్రజలను మోసంచేసి రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు డి.వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం కేతిరెడ్డిపల్లిలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గ్రామానికి చెందిన యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్‌పై నమ్మకంతోని వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారన్నారు. మాజీ ఉపసర్పంచ్ సిద్దయ్య, నాయకులు కార్యకర్తలున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చేవెళ్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాప్రభుత్వ పాలనలో అన్నిగ్రామాల్లో సీసీ రోడ్ల పనులు ఊపందుకున్నాయని ఆలూరు గ్రామ మాజీ ఎంపీటీసీ గోపులారం యాదమ్మ, మాజీ సర్పంచ్ అనంతరాములు గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ యాదిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆలూరులో హెచ్ఎండీఏ నిధులు రూ.10 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెస్కారి రాజు, తలారి రాజు, జి.అశోక్, సునీల్‌కుమార్, సుదర్శన్, శంకరయ్య, నర్సింలు, ఆనందం, రుక్కయ్య, జంగయ్య, బాలరాజు, శ్రీనివాస్, ప్రశాంత్, బుచ్చయ్య, రాజు, మహేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆలూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు